# కోపం రావడం మానేసింది

దొడ్లో గడ్డి బాగా పెరిగిపోయింది. ఇటీవల నాకు తోటపని చేయడానికి తీరుబడి ఉండడం లేదు.

ఉదయం లేస్తే పేపరు చదవడమే గగనమైపోతోంది. శ్రీమతికైతే చెప్పనే అక్కర్లేదు. ఇద్దరు పిల్లల్ని స్కూలుకి పంపడంలో ఆమె బిషన్ సింగ్ బేడీ దగ్గర మన క్రికెటర్లలా అలసిపోతుంది.

ఆ తర్వాత ఆఫీసు.

సాయంత్రం కాసేపలా షికారు. తర్వాత పిల్లల హోంవర్కుతో నేను బిజీ.

ఇదికాక టీ.వి చద్దన్నం టీ.వి., మధ్యాహ్నం టీ.వి., రాత్రి టీ.వి., సెలవు రోజుల్లో టీ.వి.

ఇంక తోటపని ఎప్పుడు?

తోటలో కాయగూరలున్నాయి. ఫలవృక్షాలున్నాయి. పూలమొక్క లున్నాయి. అద్దె యిల్లయితేనేం. ఏ మహానుభావుడు వేశాడో కానీ పట్నంలో ఉద్యోగం చేస్తున్నా పల్లెటూరి రైతుకులా ఫలసాయం పొందుతున్నాను. అయితే దొడ్లో తోటను మెయింటైన్ చేయడమే నా కిబ్బందిగా వుంటోంది.

అప్పుడు పరిచయమయ్యాడు నాకు రాముడు.

తోట పనిచేయడంలో రాముడికి రాముడే సాటి.

వాడు నల్లగా పొడవుగా, బలిష్టంగా ఉంటాడు. తోటపని తప్ప మరోటి చేయనని ప్రతిజ్ఞ పట్టడం వల్ల వాడి పెళ్లాం మామూలుగాకంటే ఎక్కువ శ్రమపడుతుంది.

రాముడికి రాత్రయ్యేసరికి మందుండాలి. అదుంటే ఈ ప్రపంచంలో ఇంకేమీ అక్కర్లేదు వాడికి. మందు కోసమే వాడు తోటపని చేస్తాడు. మందు కోసమే వాడు పెళ్లాన్నేలు కుంటున్నాడు. అంటే పెళ్ళాం డబ్బుల్తో తాగుతాడని కాదు.

ఆ విషయంలో వాడికి చాలా పౌరుషం. తను సంపాదించుకున్న డబ్బుతోనే వాడు తాగుతాడు. ఎటొచ్చీ వాడి పౌరుషమంతా తాగుడుకు సంబంధించినంతవరకే! లేకుంటే వాడుండే గుడిసె అద్దె వాడు కట్టే బట్ట, తినే తిండి - అన్నీ పెళ్ళాం సంపాదన మీదే తీరు తున్నాయి.

తాగుడుకు సంబంధించినంతవరకూ పెళ్ళాం వాడికెలా సాయపడగలదంటే... తోటపని యిప్పించి!

రాముడి నోటి దురుసుతనం అంతా యింతా కాదు. వాడు ఎంతవారినైనా ఎంత లేసిమాటలైనా అనగలడు. పని చేస్తూంటే వాణ్ణి తప్పు పట్టడానికి లేదు. సలహా యివ్వడానికి లేదు.

''ఏం పనో చెప్పండి. ఎలా చేయాలో నే చూసుకుంటా. ఇలా చేయమని నాకు చెప్పారో గొడవైపోతుంది'' అంటాడు పనిలోకి దిగే ముందే!

ఏమాటకామాటే చెప్పుకోవాలి. వాడు పని బాగా చేస్తాడు. పనిలో వంక పెట్టడాని కుండదు.

అందువల్ల చాలామంది వాడితో మనకెందుకులే అనిఊరుకుంటారు. కానీ ఒకసారి పని చేయించుకున్నవాళ్ళు రెండోసారివాణ్ణి పిలవడానికి జంకుతారు. వాడి పెళ్ళాం వాళ్ళ కాళ్ళావేళ్ళాపడి, వాడి తరఫున క్షమార్పణలు చెప్పుకుంటుంది. దాని ముఖం చూసి ఏమీ అనలేక, దాని బ్రతుకు మీద జాలికొద్దీ చాలా మంది వాణ్ణి మళ్ళీ మళ్ళీ పనికి పిలుస్తూంటారు.

అలా నేనూ వాణ్ణి నాలుగైదు సార్లు పనిలోకి పిలిచాను. అయితే నాకు కోపం ఎక్కువ. ఇంట్లో చీటికీ మాటికీ అయిందానికీ కానిదానికీ పెళ్లాం బిడ్డల మీద ఎగిరెగిరిపడుతూంటాను. అలాంటిది యజమానిగా పనివాణ్ణి సహిస్తానా?

రాముడు మా దొడ్లో తోటపని చేసినపుపడల్లా నేను సహనం కోల్పోయి గట్టిగా అరవడం, చుట్టు పక్కలవాళ్లు చేరడం జరిగేది. అంతా నన్నే సపోర్టు చేసినా అంతమందికీ రాముడొక్కడూ సమాధానం చెప్పగలిగేవాడు.

ఇది నాకు అవమానకరంగానూ, చుట్టు పక్కల వాళ్లకు వినోదంగానూ వుంటోందని గ్రహించేక శ్రీమతి ఒక రోజున, ''చేతనైతే మనం చేసుకుందాం. లేదా దొడ్లో తుప్పలు, దుబ్బలు పెరిగిపోయినా అలాగే వదిలేద్దాం తప్ప రాముణ్ణి మాత్రం మళ్ళీ పనిలోకి పిలవద్దు'' అని ఆర్డరు జారీ చేసింది.

ఇది జరిగి ఏడాదయింది.

అడపాదడపా దొడ్లో మేమేం చేసినా అది తొళ్ళికలతుప్పు వదిలించడానికి మాత్రమే పనికొచ్చేది. తోట పనికి సంబంధించినంత వరకూ మాది ఉడతాభక్తే అయ్యేది. అప్పుడప్పుడు పాలవాడొచ్చి గడ్డి కోసుకుని పోయేవాడు. కొడవలి తెచ్చి తనకు అనుకూలంగా గడ్డి కోసుకునేవాడు తప్ప వాడు తోటపని చేసేవాడు కాదు.

నాలుగు రోజుల క్రితం దొడ్లో పాము కనబడింది. అది తాచుపామని కొందరు, కట్ల పామని మరి కొందరు అన్నారు. దాన్ని చూసిన వాళ్ళు కూడా అడుగున్నర నుంచి ఆరడుగులదాకా రకరకాల కొలతలు చెప్పారు. అందరూ ఏకీభవించిందల్లా పామొచ్చి చేరిందని!

రాముడి అవసరం నాకు తప్పదు.

"వాడి పెళ్ళాం ఊ..ఇదైపోతోందండీ! ఎవరూ పనిలోకి పిలవక నాలుగు రోజుల్నించి వాడు తాగుడుకు వెళ్ళలేదుట..." అంటూ శ్రీమతి బాధపడింది.

"కానీ వాడొస్తే చుట్టుపక్కలవాళ్ళందరికీ పెద్ద ఫార్సు..." నసిగాను. కానీ పాము, ప్రాణభయం నా అహాన్ని చంపుతున్నాయి.

"అందుకుపాయం ఆలోచించాను. మీరాఫీసుకు వెళ్ళగానే వాడొస్తాడు. మీరు ఇంటికొచ్చేలోగా పని పూర్తి చేసుకుని వెళ్ళిపోతాడు" అంది శ్రీమతి.

సరేనన్నాను.

ఆఫీసులో కొత్త బాస్ వచ్చి నాలుగు రోజులయింది. ఆయన చాలా కోపిష్టి అంటున్నారు. నాకూ ఆయనకూ భేటీ పడవచ్చునని అంతా అనుకుంటున్నారు. అసహనానికి నేను మారు పేరు.

అనవసరంగా బాస్‌తో గొడవౌస్తుందని నేను భయపడ్డాను కానీ వచ్చిన మూడో రోజునే ఆయన నన్ను పిలిచి, "యూ ఆర్ వండ్రఫుల్ వర్కర్. నువ్వు ఫైల్సు మెయింటైన్ చేసే పద్ధతి, నోట్స్ రాసే తీరు అన్నీ నాకు నచ్చాయి. మెరిట్ ప్రమోషన్‌కు నీ పేరు రికమెండ్ చేశాను. మూడు వారాల్లో ఓ కమిటీ వచ్చి నిన్నింటర్వ్యూ చెయొచ్చు. బీ ప్రిపేర్డ్. నీకు నా సాయమెలాగూ ఉంటుందనుకో" అన్నాడు.

ఆశ్చర్యానందాలు నన్నప్పుడు కమ్మేశాయి. బాస్ కోపిష్టి కావచ్చు కానీ మెరిట్ గుర్తిస్తాడని అర్థమయింది.

కానీ అయిదో రోజున....

బాస్ నన్ను రిక్వెస్టు చేసి తన స్వంత పని గురించి బ్యాంకుకు పంపాడు. వెళ్ళాను. నా అదృష్టంకొద్దీ కష్టమైనపని సాధించగలిగాను. బాస్ నన్ను తప్పక మెచ్చుకుంటాడని ఉత్సాహంగా తిరిగి వెడితే ఆయన అక్కడ నా గురించి ఎదురు చూస్తూ అపర రుద్రుడి లాగున్నాడు.

నా కోసం కస్టమర్ వచ్చాడు. సమయానికి సీట్లో లేనని ఆయన కోపం, సీట్లో ఎందుకు లేనో చెప్పబోతే కూడా వినకుండా, "నో ఎక్స్‌క్యూజస్. యూ ఆరెట్ ఫాల్ట్. మళ్ళీ యిలాంటిది జరిగితే నేనూరుకోను" అంటూ గట్టిగా అరిచాడు.

కోపం, ఉక్రోషం ఒక్కసారిగా కలిగాయి. కానీ తమాయించుకున్నాను.

ఆ రోజంతా నాకు మనసు మనసులో లేదు.

సాయంత్రం ఇంటికి వెళ్ళేసరికి రాముడు, శ్రీమతి తగవు పడుతున్నారు. నన్ను చూస్తూనే శ్రీమతి, "ఒక్కరోజులో పని పూర్తిచేస్తే ఇరవై ఇస్తానన్నాను. పాముని చంపితే ఇంకో పదిస్తానన్నాను. అన్నింటికీ ఒప్పుకుని పని మొదలెట్టి పూర్తి చేశాడు. పాముని పట్టి చంపేశాడు. ఇప్పుడు ముప్పై ఇస్తూంటే చాలదంటాడు" అంది.

రాముడు నాకేసి తిరిగి, "బాబూ, తమరు చదువుకున్నోళ్ళు, డబ్బు లెక్కలు బాగానే కడతారు కానీ ప్రాణాల విలువ కట్టలేరు. అసలు పామున్న దొడ్లో పనెవరు చేస్తారు బాబూ! నేను తాగుబోతెదవని కాబట్టి చుక్క కక్కుర్తి కోసం పనికొప్పుకున్నాను. నా అదృష్టం బాగుండి నేను చావలేదు. పురుగు కుట్టి నేను చస్తే మీరేం చేస్తారు బాబూ! తమరుద్యోగం చేస్తే ఏ ప్రమాదం జరిగినా మీ ఆఫీసు చూసుకుంటాది. మీ దగ్గర పనిచేస్తే మీరు నన్నలా చూసుకుంటారా? దేశానికి స్వాతంత్రమొచ్చిందని పెద్ద కబుర్లు చెబు తారు కానీ చదువుకున్నోళ్ళకో న్యాయం, చదువులేనోళ్లకో న్యాయం కాదంటారా? మీ దొడ్లో పాముంటే చంపడానికి మీకు భయం. అందుకు నేను కావాలి. నేను చస్తే నా ప్రాణానికి విలువ లేదు. కానీ పది రూపాయల కాడ కక్కుర్తి. ఏం, కట్టుకుపోతారా, బాబూ!"

ఒకసారి వాడు మొదలుపెడితే ఆగడం కష్టం. వాడిలా మొదలు పెడితే నేనూ రెచ్చిపోతాను. అప్పుడు చుట్టుపక్కలవాళ్ళొస్తారు.

అలాగని భయపడిందో ఏమో శ్రీమతి నన్ను లోపలికి లాక్కుని వెళ్ళి, "పొరపాట యింది. మీరొచ్చే లోగా వాణ్ణి పంపడం అవలేదు. నేను చూసుకుంటాన్లెండి కానీ మీరు బట్టలు మార్చుకోండి" అంది.

నేను శ్రీమతి ముఖంలోకి చూస్తూ, "ఈరోజాఫీసులో ఏమయిందో తెలుసా?" అన్నాను.

"తర్వాత వింటాను. ముందు వీణ్ణి వదుల్చుకోనివ్వండి"

"అలాకాదు వినాలి" అంటూ జరిగింది. చెప్పి, "చదువుకున్న నా బాస్ అనాగరికంగా ప్రవర్తించినప్పుడు చదువుకోని వీడిలా అర్థంలే కుండా మాట్లాడితే తప్పేముంది?" అన్నాను.

రాముడు దొడ్లోంచి అరుస్తున్నాడింకా. నేనటువెళ్ళబోతూంటే, "మీరింకా కోపంలో ఉండి వుంటారు. ఇప్పుడు మీ బాస్ మీద కోపాన్ని కూడా వాడి మీద చూపించారంటే పెద్ద రభసవుతుంది..." అంటూ వారించింది శ్రీమతి.

"భయపడకు.." అంటూ దొడ్లోకి వెళ్లి, "ఏరా ఊరికే అరుస్తావెందుకు? 'తాగడానిక్కావాలి... అయ్యా! ఇంకో పది రూపాయిలిప్పించండి' అని మర్యాదగా అడిగితే ఇవ్వకపోయామా? ఇవిగో నలభైరూపాయలు తీసుకో..." అంటూ రెండు ఇరవైలు వాడి చేతిలో పెట్టాను.

నేను గొడవపడకుండా డబ్బిచ్చేసరికి వాడికి నోట మాటరాలేదు.

"చదువు నా చురుకుతనాన్ని చంపేసింది. అందుకే నేను పాముకి భయపడ్డాను. నీ చురుకుతనానికి పురాణకాలపు నాగులే భయపడాలి. నిన్నీ కలికాలం పాములేం చేస్తాయిరా?

ఆ సంగతి తెలిసే నిన్నీపనికి పురమాయించాం" అన్నాను నేను మళ్ళీ.

వాడింకా నోట మాట రాక అలాగే చూస్తున్నాడు.

"పాము నిన్నేమీ చెయ్యలేదని మాకు తెలుసురా? అందుకే నిన్ను పిలిచాం. కానీ నీకు డబ్బివ్వాలంటే మాకు సంతోషంగా ఉండదురా! ఎందుకంటే నువ్వు తాగే ఆ సారా ఉందే అది నీ రక్తమాంసాల్ని పీల్చి పిప్పి చేసి ఒక రోజున నిన్నెందుకూ పనికిరానివాణ్ణి చేసి వదుల్తుంది. నా మాట విని ఈ అలవాటు వదులుకోరా .. నీ పెళ్ళాంతోపాటు మేమంతా సంతోషిస్తాం."

రాముడు చటుక్కున డబ్బు వెనక్కిచ్చి, "తప్పైపోయింది బాబూ! నాకు అన్న ప్రకారం ముప్పయ్యే ఇప్పించండి" అన్నాడు.

నేను తల అడ్డంగా ఊపి, "పని బాగా చేస్తే ఆఫీసులో నాకు మెరిట్ ప్రమోషనిస్తారు. అంటే జీతం పెంచుతారన్నమాట. నువ్వు తోటపని అద్భుతంగా చేశావు. పామును చంపినం దుక్కాదు. నీ పని చూసి నీకు ఈనామిస్తున్నాననుకో. ఈ నలభై తీసుకుని వెళ్ళు. ఈ డబ్బుతో నువ్వు తాగకపోతే నేనింకా ఎక్కువ సంతోషిస్తాను."

"తాగుబోతెదవని నోరూరుకోదు. నా మనసు నా అదుపులో ఉండదు. నన్ను మన్నించండి బాబూ" అంటూ వాడు నాకు పాదాలంటి నమస్కరించి వెళ్ళి పోయాడు. వాడు తిన్నగా సారా దుకాణానికే పోతాడని నాకు తెలుసు!

కానీ జరిగిందానికి శ్రీమతి ఆశ్చర్యపోయి, 'మీరు మీరేనా? నేనిది నమ్మలేక పోతున్నాను. కానీ మీరిలాగుంటే అడ్డమైనవాళ్ళూ మీ నెత్తెక్కి స్వారీ చేయగలరు జాగ్రత్త' అంది.

నేను నవ్వి, "మెరిట్ ప్రమోషనిస్తాడని ఆశపడో, డిసిప్లినరీ యాక్షన్ తీసుకుంటాడని భయపడో అర్థం లేని నా బాస్ అనాగరిక ప్రవర్తనను సహించాను. నిజానికి చదువుకున్నవాడికి సంస్కారముండాలి. నా బాస్‌కి అది లేదు. అయినా నేనది భరించినప్పుడు చదువుకోనివాడి కుసంస్కారాన్నెదిరించే అర్హత నాకుందా? ఇంతకాలం నేను కోపిష్టివాడినని నమ్ముతూ వచ్చాను. కానీ నా కోపం నాకంటే అసమర్థులకూ, అసహాయులకూ పరిమితమని ఈ రోజే తెలిసింది. నాలోనూ సహన ముంది. నా బాస్ అన్యాయాలను సహించినంతకాలం నేనిక ఎవరి అన్యాయాలనూ ఎది రించను" అని..

"నా సహనం చదువుకోని రాముడిలో అంతో యింతో సంస్కారాన్ని ప్రవేశపెట్టి తన తప్పొప్పుకునేలా చేసింది. కానీ చదువుకున్న బాస్‌లో అదే సహనం అహాన్ని మాత్రం పెంచగలదంతే!" అన్నాను.

శ్రీమతికి నా మాటలర్థమయ్యాయో లేదో!

నాకు మాత్రం ఆ రోజు నుంచీ నన్ను మోసగించాలనుకునే రిక్షా వాళ్ళ మీదా, కూలి వాళ్ల మీదా కూరగాయలవాళ్ళ మీద రవంత కూడా కోపం రావడం లేదు.

తనలోని అవకాశవాదాన్ని గుర్తించిన ఏ మనిషీ కూడా ఎదుటి వారిపై కోపగించుకోలేడేమో?! ★

*(స్వాతి సపరివార పత్రిక - 4-1-91).*